క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

తెనాలిఅర్బన్: డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు మేనేజర్ ఎ.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి డిపో పరిధిలో ఎదుర్కొనే సమస్యలు, సూచనలు, సలహాలను ప్రయాణికులు తెలియజేయాలని పేర్కొన్నారు.

తెనాలి ఇన్‌చార్జి ఎంపీపీగా రమాదేవి



తెనాలిఅర్బన్: తెనాలి మండల ప్రజా పరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షురాలిగా గోపిశెట్టి రమాదేవి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈమె బుర్రిపాలెం ఎంపీటీసీగా ఎన్నికై వైస్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. ఈ నెల 5న ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాల మేరకు రమాదేవిని ఇన్‌చార్జిగా అధికారులు నియమించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మణ్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభినందించారు.

ముగిసిన జంప్‌రోప్ పోటీలు



తెనాలి: తెనాలిలో మూడు రోజులుగా జరుగుతున్న జంప్ రోప్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానం సాధించగా, మహారాష్ట్ర, హరియాణ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

వృద్ధురాలు అదృశ్యం



తెనాలిరూరల్: వృద్ధురాలు అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలకలూరుకు చెందిన 65 ఏళ్ల కాకార్ల కెజియమ్మ ఈ నెల 15న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఎక్కడ వెతికినా.. ఫలితం లేకపోవడంతో ఆమె కొడుకు జగదీష్ రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96170, 94407 91219 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జూదరుల అరెస్ట్

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంజీవయ్యనగర్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడిచేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 13,500లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

పట్నంబజారు: ఆటోడ్రైవర్‌పై దాడిచేసిన వారిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఆటోస్టాండ్‌లో షేక్ బాషా అనే వ్యక్తికి సభ్యత్వం ఉంది. ఈక్రమంలో మంగళవారం గుర్తుతెలియని మరో ఆటోడ్రైవర్ స్టాండ్ వద్ద ఆటోను నిలిపాడు. బాషా స్టాండ్‌కు అడ్డంగా ఉన్న ఆటోను తొలగించాలన్నాడు. పూటుగా మద్యం సేవించి ఉన్న గుర్తుతెలియని ఆటోడ్రైవర్ బాషాను దుర్భాషలాడడంతోపాటు, రాడ్‌తో దాడిచేశాడు. బాషాకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరుఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీ కాలనీకి చెందిన షేక్ లాహెరా సెల్‌ఫోన్‌కు ఇటీవల వాట్సాప్‌లో లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా అవతలవారు టాస్క్ ఇచ్చారు. రూ. వెయ్యి చెల్లించి టాస్క్ పూర్తి చేస్తే రూ.1400 చెల్లిస్తామని చెప్పారు. లాహెరా మొదట టాస్క్ పూర్తి చేయడంతో రూ. 1400 వచ్చాయి. అనంతరం రూ. 3వేలు చెల్లించాలని గ్రూపు నిర్వాహకులు చెప్పారు. లాహెరా రూ. 3వేలు చెల్లించి టాస్క్ పూర్తి చేసింది. అయితే టాస్క్ పూర్తి కాలేదని గ్రూపు నిర్వాహకులు మెసేజ్ ఇచ్చి మరికొంత చెల్లించాలంటూ పలుమార్లు కోరారు. లాహెరా మెసేజ్‌లో వచ్చిన ప్రకారం మొత్తం రూ.79వేలు చెల్లించింది. తనకు రావాల్సిన డబ్బులు నిర్వాహకులు ఇవ్వకపోడంతో తాను మోసపోయినట్లు గుర్తించి, బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా శ్రేయస్సే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ప్రభుత్వం అందించే కళ్లజోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం చినరావూరు తోటలోని మదర్ థెరిస్సా మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. రోగులతో మాట్లాడారు. అలాగే అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే శివకుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో జనరల్ 147, పిడియాట్రిక్ 13, ఫిజీషియన్ 25, ఆప్తమాలజీ 120 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.జశ్వంతరావు, కౌన్సిలర్లు దాసరి వీరవసంతరావు, పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ ఆఫీసర్ తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రత సీఎం వైఎస్ జగన్ లక్ష్యం



అత్తోటలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు

అత్తోట(కొల్లిపర): ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాల ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మంగళవారం అత్తోట గ్రామ సచివాలయం పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు సందర్శించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ దేశబోయిన నాగపుణేశ్వరరావు, ఎంపీటీసీ బొల్లిముంత పోతురాజు, ఎంపీడీవో వి.విజయలక్ష్మి , తహసీల్దారు జి.నాంచరయ్య, పార్టీ మండలాధ్యక్షులు అవుతు పోతిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సాలీపేట అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం సాలీపేట టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏఈపీపీ సునీల్ కుమార్

తెనాలిరూరల్: బాల్య వివాహాలు చేస్తే.. శిక్ష తప్పదని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలో మంగళవారం తెనాలి డివిజన్‌లోని మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలన్నారు. 18 ఏళ్ల లోపు ఆడ పిల్లలకి, 21 ఏళ్ల లోపు మగ పిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని, జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, ఏపీపీ సునీల్ కుమార్, రాష్ట్ర కార్యక్రమ సమన్వయకర్త తిరుపతిరావు, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధ్యక్షురాలు దుర్గాభవాని, లీగల్ అధికారి వాసంతి, తెనాలి సీడీపీవో సునీత పాల్గొన్నారు.

26న వైఎస్సార్ సీపీ బస్సు యాత్ర



తెనాలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 26న తెనాలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలంలో బస్సు యాత్రపై మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొనే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. యాత్రలో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాల కల్పనకు ఆయా గ్రామంలోని పార్టీ ప్రధాన నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. బస్సు యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సభలో ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

తెనాలి టౌన్: తెనాలి నియోజకవర్గంలో బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పార్టీ నాయకులను కోరారు. కొత్తపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఇన్‌చార్జి ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి, ఎంపీటీసీ ధర్మరాజుల చెన్నకేశవులు మాట్లాడారు.

శలపాడులో అగ్ని ప్రమాదం



శలపాడులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పూరిల్లు, కాలిబూడిదైన వస్తు సామాగ్రి



కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావు

పూరిల్లు దగ్ధం

శలపాడు(చేబ్రోలు): ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమవటంతో నిరుపేద కుటుంబం నిరాశ్రయులైన ఘటన చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని శలపాడు గ్రామానికి చెందిన పురుషోత్తపుపట్నం కళ్యాణ్, నాగమణి దంపతులు పూరింట్లో నివసిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో క్షణాల్లో ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో ఇంటిలోని వస్తు సామాగ్రి, దుస్తులు, విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు, టీవీ, ఫ్రిజ్, మంచాలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. తెనాలి అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

శలపాడు గ్రామంలో అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కళ్యాణ్, నాగమణి కుటుంబానికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ సర్పంచ్ మన్నెం శిరీష, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావులు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. రూ. ఐదువేల నగదు, నిత్యావసర వస్తువులను అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేయనున్నట్లు మన్నెం వేణుగోపాలరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం సిస్టర్ థెరసమ్మ, ఉపాధ్యాయులు

ఫిరంగిపురం: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఫిరంగిపురంలోని సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఒట్టి థెరసమ్మ తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల చిలుకలూరిపేటలో నిర్వహించిన అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు డి.జనని, ఆర్.గౌతమి, సయ్యద్ మరియాంబి, సీహెచ్ ప్రసన్నకుమారి, పి.మరియకీర్తి, జి.లక్ష్మీసుకన్యలు విశేష ప్రతిభ కనబర్చారని చెప్పారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పీజే నిర్మలామేరి, వి.శిల్ప, వేళాంగిణిరెడ్డి, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



నెహ్రూనగర్: రెడ్డి జన సేవాసమితి, రెడ్డి జనాభ్యుదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఉడుముల నర్సిరెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్‌లో మంగళవారం స్కాలర్‌షిప్పులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీసీ ఎక్స్‌పోర్ట్ జనరల్ మేనేజర్ వి.వెంకట్రామిరెడ్డి, మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ శీలం వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొని విద్యార్థులకు రూ. 7 లక్షల స్కాలర్‌షిప్పులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహాయం అందుకుని చదువులో రాణించాలన్నారు. చదువులేకపోతే భవిష్యత్తు లేదని పేర్కొన్నారు. నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలి సభ్యులు మోదుగుల పాపిరెడ్డి, చల్లా అంజిరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, కంది సంజీవరెడ్డి, వి.సాంబిరెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి, భవనం వెంకటరెడ్డి, లేళ్ల పెదఅప్పిరెడ్డి, జంగా సీతారామ్‌ప్రసాద్, శ్యామల కోటిరెడ్డి, దుగ్గెంపూడి సాంబశివారెడ్డి, ఓరుగంటి నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

ఎస్ఈబీ జేడీ డీఎస్ మహేష్



మంగళగిరి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ జేడీ డీఎస్ మహేష్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఈబీ కార్యాలయంలో మంగళవారం వసతి గృహ నిర్వాహకులకు మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి అలవాటు కారణంగా వారి భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో వసతి గృహ నిర్వాహకులు తెలియజేయాలన్నారు. వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులపై నిరంతరం నిఘా ఉంచి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంపై ఎవరి మీదైనా అనుమానం వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వారికి కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మారయ్యబాబు సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు: పేకాట శిబిరంపై దాడి చేసి, ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. కొల్లూరు పోలీసుల వివరాల మేరకు.. గాజుల్లంక - పోతార్లంక గ్రామాల నడుమ కృష్ణా నది ఒడ్డున పేకాట నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు. తమ సిబ్బందితో దాడి చేసి, ఏడుగురు జూదరునలు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. నిందితులను తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు చెప్పారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

పిట్టలవానిపాలెం: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. చందోలు ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు పిట్టువారిపాలెం గ్రామానికి చెందిన పిట్టు మణికంఠారెడ్డి (33) గ్రామం నుంచి ప్రధాన రహదారిలోకి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో రెడ్డిపాలెం వైపు నుంచి ఖాజీపాలెం వైపు వెళ్తున్న మినీ లారీ అతనిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయాలైన మణికంఠా రెడ్డిని వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

15 రోజుల్లో లే అవుట్‌లకు అనుమతి

నగర కమిషనర్ కీర్తి చేకూరి



పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా దరఖాస్తు చేసే లేఅవుట్‌లకు 15 రోజుల్లో అనుమతులు ఇస్తామని, అనధికార లే అవుట్స్ తొలగింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లే అవుట్ ఉండడానికి వీలులేదని, ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లే అవుట్స్‌కి 15 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అనధికార లే అవుట్స్‌ని రానున్న వారం రోజుల్లో తొలగించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. దరఖాస్తు చేసిన లే అవుట్ అనుమతుల్లో ఎటువంటి జాప్యం, లేదా సమస్యలు ఉన్నా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని, లేకుంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 లేదా, 9849908381 నంబర్‌కు వాట్సాప్ చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో పెండింగ్ ఉన్న సర్వే దరఖాస్తులను వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. కోర్ట్ కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, కంటెమ్ట్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్లు కోటయ్య, మహాపాత్రో, ఏసీపీలు అజయ్ కుమార్, టీపీఎస్‌లు, ఏఈ పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ బ్రోచర్ల ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పలు కళాశాలల ప్లేస్‌మెంట్ బ్రోచర్లను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల పూర్తి సమాచారంతో రూపొందించిన ప్లేస్‌మెంట్ బ్రోచర్లు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు సులభంగా లభించేందుకు దోహదం చేస్తాయన్నారు. యూనివర్సిటీ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, ఆర్కిటెక్చర్ కళాశాల, వ్యాయామ విద్య కళాశాలల బ్రోచర్లు ఆవిష్కరించడం జరిగిందన్నారు. కరోనా తర్వాత జరిగిన 2020-21, 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ బ్రోచర్లను ఆయా కంపెనీలకు పంపి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెక్టార్ ఆచార్య, ప్రిన్సిపాల్స్ పి.సిద్ధయ్య, ఆచార్య పి.జాన్సన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జీవీఎస్ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకై క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి పర్యవేక్షణలో ఐటీఎం స్కిల్స్ అకాడమీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల్లో రాత, మౌఖిక పరీక్షల అనంతరం తొమ్మిది మందిని తదుపరి ప్రక్రియకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జేకేసీ సమన్వయకర్త కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ పాల్గొన్నారు. అభ్యర్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అభినందించారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరీ



కచేరీ చేస్తున్న రాంప్రసాద్ బృందం

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘం, 45వ వార్షికోత్సవం, వాగ్గేయకార మహోత్సవాలు ముగింపు సందర్భంగా పాలఘాట్ రాంప్రసాద్ బృందం చేసిన శాస్త్రీయ సంగీత కచేరీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీ త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రితో పాటు అనేక వాగ్గేయకార కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై ఎల్.రామకృష్ణన్, మృదంగంపై పి.ఫల్గున్ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, సహ కార్యదర్శి కృష్ణ కిశోరులు ఘనంగా సత్కరించారు. వల్లూరి కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వృద్ధురాలికి శస్త్రచికిత్స



గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు 80 ఏళ్ల వృద్ధురాలికి కోత కుట్టు లేకుండా అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. గుంటూరులోని కోబాల్ట్‌పేటకు చెందిన 80 ఏళ్ల హబీబున్నిసా ఈనెల 10న గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగానికి చికిత్స కోసం వచ్చింది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేసి చిన్నపేగులో పసరుతిత్తినాళం, ప్యాంక్రియాస్ నాళం కలిసేచోట చిన్న గడ్డ ఉన్నట్లు నిర్ధారించారు. ఈనెల 14న వృద్ధురాలికి ఎండోస్కోపిక్ ద్వారా కోత, కుట్లు లేకుండా తుది దశలో ఉన్న క్యాన్సర్ గడ్డను తీసి పెద్ద ఆపరేషన్‌తో పనిలేకుండా నివారించారు. ఆరోగ్యం కుదటపడడంతో 14న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఫాలోఅప్ చికిత్స కోసం మంగళవారం హబీబున్నిసా జీజీహెచ్‌కు రాగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యులను అభినందించారు.

ఈసీజీ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి ..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గుండె జబ్బుల వైద్య విభాగానికి అనేక మంది పేద రోగులు వస్తున్నారని, ఈసీజీ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఈసీజీ విభాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసీజీ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని, రోగుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఉద్యోగులు పనితీరు మార్చుకోకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని ఉన్నారు.

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌కు సత్కారం



జిల్లా ఎస్పీని సత్కరిస్తున్న ఆర్గనైజేషన్ నిర్వాహకులు

నగరంపాలెం: లాలాపేట పీఎస్ పరిధిలోని మంత్రి బజార్‌లో సోమవారం నాలుగేళ్ల పఠాన్ షాహిద్ అలీఖాన్ కిడ్నాప్‌కు గురవ్వగా.. గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించిన విషయం విదితమే.. ఈ కేసులో సత్వరమే స్పందించిన జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్‌ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నారీ సమాన్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షురాలు షేక్ సలీమా, సభ్యురాలు ఫైరోజ్‌లు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, ఎస్బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.